# ఎవరో? ఏమిటో?

## కొమ్మూరి వేణుగోపాలరావు

ప్రక్కింట్లోకి కొత్తగా ఎవరో దిగారని విని,

ఆ ఇల్లు చాలా కాలంగా ఖాళీగా వుంది కాబట్టి, మా శ్రీమతికి మళ్ళీ కంపెనీ దొరికిందని సంతోషించానుగానీ, కొద్ది రోజుల్లోనే ఆ సంతోషమల్లా ఇబ్బందిగా మారిపోయింది.

ఎందుకంటే....

వాళ్ల సామాన్య దంపతుల్లా కాకుండా, అపురూప భార్యాభర్తలైనట్లు, ఆమె కనిపెట్టేసింది.

అసలు మానవజీవితంలోని విషాదమంతా యీ పోలికలలోనే ఉద్భవించి వుంటుంది. ఫలానా వాళ్ళబ్బాయికి ఫస్ట్‌క్లాస్ వచ్చింది, మనబ్బాయికి రాలేదు. ఫలానా వాళ్ళ ఇల్లు బాగుంటుంది. మన ఇల్లు బాగుండదు. ఫలానా వాళ్ళు గ్రైండర్ కొనుక్కున్నారు.(వాళ్ళు దాంతో సుఖపడుకపోయినాసరే). మనం కొనుక్కోలేదు, ఫలానావాళ్ళకి ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. మనకి రాలేదు. మన ఇంట్లో కరెంటుపోయింది. ప్రక్కింట్లో పోలేదు. మనకి గ్యాస్ అయి వారమైనా ఇంకా రాలేదు. వాళ్ళకి రెండురోజులకే వచ్చింది ఇలాగ....

ఒక రోజు ఆఫీసునుంచి ఇంటికి రాగానే కాఫీ ఇస్తూ "ప్రక్కింటి వాళ్ళు ఎంత అన్యోన్యంగా వుంటారో తెలుసాండీ?" అన్నది.

"తెలియదు" అన్నాను నే కాస్సి ఒప్పుకుంటూ.

"రేపు మీరు ఆఫీసుకు అరగంట ఆలస్యంగా వెళ్ళండి. ఓ మంచి దృశ్యం చూపిస్తాను" అంది.

దానికి కూడా ఒప్పుకున్నాను.

మరునాటి ఉదయం తొమ్మిదున్నరకల్లా ఆ మంచి దృశ్యం చూడటానికి రెడీ అయి, నేనూ తనూ కిటికీ దగ్గర నిలబడ్డాము.

మరో అయిదు నిమిషాల్లో ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి.

మొదట అతను బయటకు వచ్చాడు. నలభయి ఏళ్ళుంటాయి. చెంపల దగ్గర జుట్టు కొద్దిగా నెరిసింది. ఎర్రగా, బొద్దుగా బాగానే వున్నాడు.

తర్వాత ఆమె గుమ్మం దగ్గర ప్రత్యక్షమైంది. ఆమె కూడా తెల్లగానే వుంది. బొద్దుగానూ వుంది. అందంగా కూడా వుంది.

ఇద్దరూ ఒకరి ముఖాల్లోకి కాదు—ఒకరి కళ్ళలోకి ఒకరు చూసి మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళ కళ్ళు మాట్లాడుకుంటున్నాయి, పెదవులు మాట్లాడుకుంటున్నాయి. వాళ్ళలోని ప్రతి అణువూ మాట్లాడుకుంటున్నది.

ఇంట్లో ఎప్పుడూ మాట్లాడుకోనట్లు, సంవత్సరాల వియోగం తర్వాత అప్పుడే ఇద్దరూ కలుసుకున్నట్లు, మళ్ళీ ఎంతకాలానికో కలుసుకోనివారు ఆ బాధలో ఒకర్ని ఒకరు విడిచి వుండలేక మధనపడిపోతున్నట్లు—వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

అలా పదిహేను నిమిషాలు గడిచాయి.

ఆఫీసుకు ఆలస్యం అయిపోతుందన్న కంగారులో వున్నానేమో, నాకు పదిహేను యుగాల్లా అనిపిస్తోంది.

వాళ్ళకి పదిహేను సెకన్లలా అనిపించి వుండవచ్చు. చివరకు....

"రాజూ! వెళ్ళిరానా?" అన్నాడు.

"ఆమె పేరు రాజేశ్వరి" అంది శ్యామల నాకు వివరిస్తూ.

"అర్థమైంది శ్యామూ" అన్నాను.

అలా ఎప్పుడూ ఆమెను సంబోధించలేదు. తెల్లబోయినట్లు చూసి, మళ్ళీ ఆ చూపు కోపంగా మార్చుకుంది.

"జాగ్రత్తగా వెళ్ళిరండేం" అంటోంది ఆమె.

అతను మెట్లు దిగాడు.

ఆమె వైపు చూసి టాటా చెబుతున్నట్లు చెయ్యూపాడు.

ఆమె కూడా చేతిని గాలిలో కదిలిస్తోంది.

"ఇహ పద. లోపలికి పోదాం" అన్నాను.

"ఉండండి. ఇంకా అయిపోలేదు"

అతను నడుస్తూ నడుస్తూ ప్రతి పది అడుగులకీ ఒకసారి వెనక్కి తిరిగి చూస్తున్నారు. అలా చూసినప్పుడల్లా ఆమె టాటా చెబుతోంది. సందుమలుపు తిరిగేదాకా ఇద్దరూ అలా చేస్తూనే వున్నారు. మలుపు తిరిగేటప్పుడు చివరిసారి ఆమె వైపు చూసి వెళ్ళిపోయాడు. ఒక్క నిమిషం స్తబ్ధురాలయినట్లు నిలబడి, తర్వాత దీర్ఘమైన నిట్టూర్పు విడిచి దిగులుగా లోపలకు వెళ్ళిపోయింది.

ఆలస్యమైపోయిందని నేను ఆదారా బాదరాగా తెమిలిపోతుంటే "అదృష్టవంతురాలు.. అంత ప్రేమించేభర్త దొరికినందుకు" అని శ్యామల వెనక నుంచి గొణుక్కోవటం వినిపించింది.

మరునాడు సాయంత్రం ఇంటికి వచ్చాక "ఇంకో విషయం కనిపెట్టానండోయ్" అంది శ్యామల.

"నాకు కాఫీ ఇవ్వటం మరిచిపోయావు" అన్నాను గుర్తుచేస్తూ.

"సారీ" అని కాఫీ తీసుకొచ్చి "ఇవేళ ఆవిడతో పరిచయం జరిగింది" అన్నది.

"గుడ్".

"మామూలుగా భర్తని సాగనంపేసి గుమ్మంలో నిలబడ్డాక నా వైపు చూసి పలకరించింది. వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించింది. నేనూ వెళ్లాను."

"ఇదేనా కొత్త విషయం?"

"కాదు. ఇద్దరం మాట్లాడుకుంటూ కూర్చున్నాము. ఇంతలో ఫోను మ్రోగింది. ఆమె దానికోసమే ఎదురుచూస్తున్నట్లు ఛంగున వెళ్లి రిసీవరు అందుకుంది. 'ఏమండీ కులాసాగా చేరారా? అమ్మయ్య నా ప్రాణం కుదుటపడింది. నా వంట్లోనా బాగానే వుంది. సరే ఉంటానేం' పెట్టేసింది!

'ఆశ్చర్యంగా ప్రశ్నార్థంగా చూశాను.

'మా వారు' అంది.

'ఇంతకు ముందే ఆఫీసుకు వెళ్ళినట్లున్నారు' అన్నాను.

'ఆఫీసునుంచే. ఆయన అక్కడకుచేరగానే ఫోన్ చెయ్యకపోతే నా ప్రాణం రెపరెప కొట్టుకుంటుంది!'

"ఆఫీసు ఇక్కడ్నుంచీ ఎంత దూరం

వుంటుంది?' అనడిగాను.

'మూడు ఫర్లాంగులు వుంటుంది' అంది."

నేను కాఫీ త్రాగటం ముగించి ఏమీ మాట్లాడక పోవటం చూసి "మాట్లాడరేం? మీకాశ్చర్యంగాలేదూ?" అంది.

"ఈ సంసారాల్లో ఒక భాగమిది" అన్నాను.

ఒకసారి నేనేదో పనివుండి బస్‌స్టాండ్‌కు వెళ్లాను. అక్కడ ప్రక్కింటి దంపతులు పిల్లల్తో సహా కనిపించారు. గుంటూరు వెళ్లే బస్సు దగ్గర నిలబడి వున్నారు. నేను వాళ్ళకి కనబడకుండా ఎంక్వయిరీ ఆఫీసు దగ్గర నిలబడి, ఏం జరుగుతుందోనని చూస్తున్నాను.

ఆయన బస్సులో ఎక్కి కిటికీ దగ్గర కూర్చున్నాడు. భార్య, పిల్లల్తో ప్లాట్‌ఫారంమీద కిటికీ దగ్గరగా నిలబడింది. ఇద్దరు ఒకరి ముఖంలోకి ఒకరు దిగులుగా చూసుకుంటు న్నారు. "ఏమండీ! జాగ్రత్తగా వెళ్లిరండేం" అంటోంది. "అలాగే. అలాగే" అంటున్నాడు. బస్సు కదిలింది. పిల్లలు "నాన్నా వుంటాం" అని చేతులు వూపుతున్నారు. ఆవిడ చేతిలో కర్చీఫ్ దిగులుగా గాల్లో కదులుతుంది కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఇరవై మైళ్ళ దూరంలో వున్న గుంటూరు చేరటానికని బస్సు కదిలింది.

నేను ఆఫీసుకి వెళ్ళి, సాయంత్రం తిన్నగా ఇంటికి రాక, ఓ స్నేహితుడి ఇంటికి వెళ్ళి కాసేపు అటూ ఇటూ తిరిగి ఇంటికి చేరే సరికి ఎనిమిది దాటింది. గదిలోకి వెళ్ళి ఎందుకో కిటికీలోంచి ప్రక్కకి చూసేసరికి ఆయన భార్యా పిల్లల్తో కబుర్లు చెబుతూ కనిపించాడు. నిజంగా నా ఆశ్చర్యానికి అవధులులేవు.

కొన్నాళ్ళకి నాక్కూడా అతన్తో పరిచయ భాగ్యం కలిగింది. ఒకసారి వాళ్ళింటికి టీకి పిలిస్తే నేనూ, శ్యామలా వెళ్లాం.

అరగంటసేపు కూర్చున్నాం. టీ త్రాగాం వచ్చాం. కాని వాళ్ళూ మేమూ అసలు మాట్లాడుకున్నామా అన్న అనుమానం మిగిలి పోయింది.

ఎంతసేపూ వాళ్ళిద్దరే మాట్లాడుకుంటు న్నారు. "రాజూ!" అని అతను. "ఏమండీ" అని ఆమె... ఎదురుగుండా అతిధులున్నారనీ వాళ్ళతో మాట్లాడవలసిన అవసరం వున్నదనీ వాళ్లు గుర్తించినట్లు కనబడలేదు.

వాళ్ళ పరిచయం తర్వాత శ్యామల ముఖంలోకనబడుతున్న దిగులు నాకర్థమైంది.

"ఆయన స్నేహితుల యిళ్ళకు వెళ్ళరు. సినిమాలకి భార్యా భర్తలు మాత్రమే కలసి వెడతారు" అనేది.

"ఆయన పేకాడరు స్నేహితుల్తో. ఆది వారాలు భార్యా భర్తలు మాత్రమే సరదాగా కార్డ్సు ఆడుకుంటారు?"

"ఆయనకు వారం వారం పార్టీలనీ. అక్కడకు వెళ్ళి ఏదో స్థితిలో ఇంటికి రావట మనీ లేదు. పార్టీలంటే ఏమిటో ఆయనకు తెలీదు!"

ఆమెగారి వ్యాఖ్యానాలు విని ఆయనకుగానీ నాకుగానీ, త్వరగా ఈ వూరినుంచి ట్రాన్స్‌ఫ రయిపోతే బాగుండనిపించింది.

ఒకసారి వాళ్ళిద్దర్నీ టీకి మేము పిలవాల్సి వచ్చింది.

శ్యామల రవ్వకేసరి, సొమాసాలుచేసింది.

మళ్ళీ వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"చూడు రాజూ! జీడిపప్పులంటే నీకు చాలా ఇష్టం" అని కేసరిలోని జీడిపప్పులు ఏరి ఆమె ప్లేట్లో ఒకటొకటిగా వేస్తున్నాడు.

'సొమాసాలు మీ కిష్టం' అని తన ప్లేట్లోవి అతనికి సరఫరా చేస్తోంది.

నాకు వినోదంగా వుంది.

శ్యామలకి తన్మయంగా వుంది.

నాకు విడ్డూరంగా వుంది.

శ్యామల అనుభూతులకి లోనవుతోంది.

వాళ్ళు వెళ్ళిపోయాక "శ్యామలా! వాళ్ళూ మనం ఏం మాట్లాడుకున్నాం?" అన్నాను.

"మీ కర్థం కాదులెండి" అని కోపంగా లోపలికెళ్ళిపోయింది.

ఓసారి ఆఫీసునుంచి ఇంటికి రాగానే శ్యామల ఆదుర్దాగా "పాపం వాళ్ళబ్బాయికి సుస్తీగా వుందిటండీ. వాళ్ళు చాలా కంగారు పడుతున్నారు. ఒకసారి వెళ్ళి చూసివద్దాం పదండి" అంది.

నేను ఇబ్బందిగా ముఖం పెట్టాను. "పోనీ! నువ్వు వెళ్ళి రాకూడదూ?"

"రండీ బాగుండదు."



విధిలేక ఆమెతో బాటు వెళ్ళాను.

ఏడేళ్ళ వాళ్ళబ్బాయి మంచం మీద పడుకుని వున్నాడు. భార్య మంచం మీదే కొడుకు ప్రక్కనే కూర్చుని వాడి గుండెపైన రాస్తోంది. భర్త కుర్చీలో కూర్చుని వున్నాడు. ఇద్దరి ముఖాలూ దిగులుతో నిండిపోయి వున్నాయి.

"ఎప్పట్నుంచీ అండీ జ్వరం?" అన్నాను నేనూ ఓ కుర్చీలో కూర్చుంటూ.

"ప్రొద్దుట్నుంచి అండీ. ఇంకా తగ్గలేదు" అన్నాడతను ఆందోళనగా.

"ఎంత వుందండీ?"

"ప్రొద్దుట తొంభయితొమ్మిది వుందండీ. ఇప్పుడు ఇంకో అరడిగ్రీ పెరిగింది. నాకేదో భయంగా వుంది."

నేనేం మాట్లాడలేదు.

"ఒకవేళ టైఫాయిడ్‌లోకి గాని వెడుతుందేమో. డాక్టరుగారొచ్చి చూసి వెళ్లారుగాని ఏమీ చెప్పలేదు. ఊళ్ళో వైరస్ ఫీవర్స్ కూడా బాగా వున్నాయి. నాకేమీ తోచటం లేదు."

కాసేపు కూర్చుని మేము వచ్చేశాము.

మరునాడు మరో రెండుపాయింట్లు పెరిగేసరికి భార్యాభర్తలిద్దరూ తల్లడిల్లిపోయారు. గబగబా డాక్టర్‌ని మార్చేశారు. వాళ్ళ ఇల్లంతా బ్రెడ్, బత్తాయిలు, ద్రాక్ష, బార్లీగింజలు, ఉడుకోలోం.... వీటిల్తో నిండిపోయింది. ఆ మర్నాటికి తొంభయితొమ్మిది, నూరు మధ్య అలా నిలబడి వుండేసరికి ఆ డాక్టర్నివొదిలేసి ఇంకో స్పెషలిస్ట్‌ని తీసుకొచ్చారు. రక్తపరీక్షలు చేయించాలా, ఎక్సరే తీయించాలా, లేక గుంటూరు జనరల్ హాస్పటల్‌కి తీసుకెళ్ళమంటారా....? ఇత్యాది ప్రశ్నలు ఆయన మీద క్రుమ్మరించారు.

వాళ్ళ దగ్గర ఫీజు తీసుకున్న పాపానికి ఈ ప్రశ్నలన్నిటినీ ఆయన భరిస్తూ చేయవలసిన వైద్యమేదో చేశాడు.

మొత్తంమీద మూడు రోజుల్లో జ్వరం తగ్గిపోయి, కనకదుర్గ గుడికెళ్ళి పూజలూ, పునస్కారాలూ చేసి, యింట్లో పెద్ద పండుగ చేసుకున్నంత హడావిడి చేశారు.

కొన్నాళ్ళయాక, ఓ రోజు ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి శ్యామల కొత్త వార్తతో సిద్ధంగా వుంది.

"ఆయన హైదరాబాద్ క్యాంప్ వెడుతున్నారట."

"అయితే ఏం?" అన్నట్లు చూశాను.

"వారం రోజులదాకా రాడట. వాళ్ళిద్దరు ఒకర్ని విడిచి ఒకరు అంతకాలం వుండలేరు కదండీ."

"పోనీ ఆవిడ్ని కూడా తీసుకెళ్ళమను."

"వెడదామనే అనుకుంది. కాని పిల్లలకు పరీక్షలు. ఇల్లు కదలటానికి వీల్లేదు."

"అయ్యో పాపం" అని సానుభూతి ప్రకటించాను.

అతని వారం రోజుల క్యాంపు మొదలవటానికి ఇంకో వారంరోజుల టైముంది.

ఈలోగా శ్యామలద్వారా ఎప్పటికప్పుడు నాకు తెలుస్తున్న విషయాలు....

ఆవిడ దిగులుపడిపోతోంది.

అతను కృంగిపోతున్నాడు.

ఆవిడ అన్నం సీఖ్యా మానేస్తున్నది.

అతను ఆఫీసు పని చెయ్యలేక పోతున్నాడు.

ఆవిడ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటున్నది.

అతను గొంతు గాద్గదికం చేసుకుంటున్నాడు.


*Happy Deepavali Greetings to*

*All our Patrons and Well Wishers from :*

# SRI SRINIVASA PAPER CONVERTERS

*Specialists in Reels Cutting :*


- * The most uptodate & ULTRA MODERN CUTTING DEVICES ESTABLISHMENT in the South.
- * Prompt and immediate execution of work assured.
- * Clearing and forwarding of Reels and Cut reams of our OUTSTATION CLIENTALE undertaken at MOST ECONOMICAL RATES.
- * Undertake also cutting of white printing paper reels to party's specifications.
- * OUR MOTTO : LESS WASTAGE & MORE REAMS TO YOUR REELS.

A trial will convince you.

*Contact :* SRI SRINIVASA PAPER CONVERTERS

6-1/A, Murugesa Mudali Street :: KONDITHOPE :: MADRAS-600 001

(Phone No. 21520 P.P.)




రోజూ ట్రంక్ కాల్ చేయాలని ఆమె ప్రమాణాలు చేయిస్తున్నది. రోజుకు రెండు సార్లు ఫోన్‌లో మాట్లాడతానని అతను ఒట్లు వేసేస్తున్నాడు.

మొత్తంమీద విదేశాలకు వెళ్ళేంత తతంగం చేశారు. వరే— స్టేషన్‌కు వెళ్ళటం సెండాఫ్ ఇవ్వటం, టాటా చెప్పటం— మామూలే.

జీవితంలో ఏదో పోగొట్టుకున్నంత బాధతో పిల్లలమధ్య ఆమె ఆ యింట్లో తిరుగాడుతున్నది.

రెండు రోజుల తర్వాత అనుకోకుండా ఉన్నపళాన హైదరాబాద్ వెళ్ళే పని పడింది.

"నేను హైదరాబాద్ వెడుతున్నా"నని ఆవిడతో చెప్తూ" అన్నాను.

"ఏం?"

"అతని యోగక్షేమాలు కనుక్కొమ్మనీ, అదనీ, యిదనీ నన్ను పురమాయిస్తుంది."

శ్యామల నా మాటను మన్నించింది.

హైదరాబాద్‌లో ఆ రోజంతా పగటి పూట నా పని పూర్తిచేసుకున్నాను.

ఆ సాయంత్రం ఓ స్నేహితుడు కలిసి బర్త్‌డే సందర్భంగా అతనింట్లో జరిగే పార్టీకి ఆహ్వానించాడు.

వెళ్ళాను.

మొత్తం పదిహేను ఇరవై మంది దాకా వున్నారు. త్రాగుతున్నారు. పేలుతున్నారు. నానా రభసా చేస్తున్నారు.

వాళ్ళందరి మధ్యా ఓ మనిషి. గతుక్కుమన్నాను.

శృంగారానికి సంబంధించిన జోక్ వేస్తూ నన్ను చూసి ఆగిపోయాడు. ముఖంలో నెత్తురుచుక్క లేదు.

చేతిలో విస్కీ గ్లాసు టేబిల్‌మీద పెట్టబోయి తడబడుతున్నాడు.

నామీద నాకు కోపం వచ్చింది. పాపం పార్టీలో అతని ఆనందం భగ్నం చేసేశాను.

అక్కడ్నుంచి తప్పుకుని వెళ్ళిపోదామనుకున్నాను. నా స్నేహితుడు కదలనివ్వటం లేదు.

పార్టీ అయిపోయేదాకా అతనివైపు చూడకుండా జాగ్రత్తపడుతూ కాలక్షేపం చేశాను.

హోటల్ రూమ్‌కి వచ్చాక రాత్రి రెండు దాటుతున్నా నిద్రపట్టటంలేదు. అతనూ— ఎక్కడ దిగాడో తెలీదుగాని తన రూమ్‌కి వెళ్ళివుంటాడు. భార్యతో ఫోన్‌లో మాట్లాడి వుంటాడు. ఇద్దరి గొంతులూ ఒణికి వుంటాయి.

బయట వరండాలో ఏదో గలాభా వినబడుతోంది. టకటక బూట్ల చప్పుడు.... అరుపులు.... హెచ్చరికలు....

చూడాలనిపించి తలుపులు తీసుకుని బయటకు వచ్చాను.

నాలుగయిదు గదుల అవతల ఓ రూమ్ దగ్గర ఓ పోలీసు ఇన్‌స్పెక్టరూ, నలుగురైదుగురు పోలీసులూ నిలబడివున్నారు. చుట్టూ హాలులో బసచేసిన కొంతమంది జనం.

రైడింగ్ అని తెలుస్తోంది. దగ్గరకు వెళ్ళాను.

మళ్ళా.... ఈసారి విద్యుద్ఘాతం తగిలినంత తీవ్రంగా దెబ్బతిన్నాను.

ఎవరో కొత్త అమ్మాయితో....అతను.

నన్ను చూశాడు. నిలువునా కంపించిపోయాడు. కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. ఈ సన్నివేశం మా ఇద్దరిమధ్యా ఎందుకు కల్పించబడిందా అని నలిగిపోతున్నాను.

పోలీసులు అతన్ని వ్యాన్ ఎక్కించే ప్రయత్నంలో వున్నారు.

ఇహ నేను కల్పించుకోక తప్పదు. ఏమి అవస్థపడ్డానో, ఎలా అతన్ని ఆ పరిస్థితినుంచి కాపాడానో, మా యిద్దరిమధ్యా ఎలాంటి సున్నితమైన వ్యవహారం నడిచిందో చెప్పటం అనవసరం.

ఇంటికి వచ్చాక శ్యామల మాత్రం నిష్ఠూరంగా "ఎందుకూ? ఒక్క ఫోనయినా చేశారా? అసలు నా గురించి మీకేం పట్టిందిలెండి. ఆయన చూడండి. అక్కడున్న వారం రోజుల్లోనూ పద్నాలుగు ట్రంక్‌కాల్స్ చేశాడు- పెళ్ళానికి" అన్నది.

